క్లుప్తంగా

బాబాపూర్‌లో కూలిన ఇల్లు



కూలిన ఇంటివద్ద బాధితురాలు మారక్క

చింతలమానెపల్లి: మండలంలోని బాబాపూర్ గ్రామంలో వర్షాలకు ఎడ్మ మారక్క అనే మహిళకు చెందిన ఇల్లు కూలిపోయింది. సోమవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో కూలిపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఇల్లు కూలిపోయిందని బాధిత మహిళ వాపోయింది. ఇల్లు లేని తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరింది.

ముదిరాజ్‌లకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

ఆసిఫాబాద్‌రూరల్: ముదిరాజ్‌లకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు సేర్ల మురళీధర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో 45 లక్షల జనాభా ఉన్న ముదిరాజ్‌లు రాజకీయంగా వెనుకబాటులో ఉన్నారన్నారు.

అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం స్టాప్ వైలెన్స్ – సేవ్ మణిపూర్ అంశంపై అవగాహన కల్పించారు. మణిపూర్ రాష్ట్రంలో గిరిజనులపై జరుగుతున్న హింస, పర్యావసనాలపై విద్యార్థులకు వివరించారు. సంఘం నాయకులు సాయికృష్ణ, నితీష్, శ్రీశైలం, సాయికిరణ్, ప్రవీణ్, సతీష్, హరీష్ పాల్గొన్నారు.

రైతుబీమా నమోదు చేసుకోవాలి



పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ నానయ్య

చింతలమానెపల్లి: రైతులు ప్రభుత్వం అందించే రైతుబీమా పథకంలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఎంపీపీ డుబ్బుల నానయ్య అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు రైతుబీమా పత్రాలు అందించి మాట్లాడారు. ఏవో రామక్రిష్ణ, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ డోకె రాజన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు డుబ్బుల వెంకన్న, సహకార సంఘం వైస్‌చైర్మన్ మారుతి పాల్గొన్నారు.

కెరమెరికి చేరిన 'టీఎస్‌సీపీఎస్ఈయూ'

కెరమెరి: జోగుళాంబ గద్వాల్ ఆలంపూర్ నుంచి జూలై 16న ప్రారంభమైన జిల్లా పాత పెన్షన్ సాధన సంకల్పయాత్ర సోమవారం కెరమెరికి చేరింది. వీరికి పీఆర్‌టీయూటీఎస్ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం టీఎస్‌సీపీఎస్ఈయూ రాష్ట్ర నాయకులు మాట్లాడారు. కార్యక్రమాల్లో సంఘం రాష్ట్ర నాయకులు గంగాపురం స్థితప్రజ్ఞ, కల్వల శ్రీకాంత్, ఈడీగి నరేశ్‌గౌడ్, పీఆర్‌టీయూటీఎస్ నాయకులు ఆడే ప్రకాశ్, భరత్, లెవన్‌కుమార్, అజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

దోమల నివారణకు చర్యలు

కాగజ్‌నగర్‌రూరల్: వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లో దోమల నివారణకు చేస్తున్న పారిశుధ్య పనులను సోమవారం ఎంపీడీవో గౌరీశంకర్ పరిశీలించారు. మండలంలోని చింతగూడ కోయవాగు, భట్‌పల్లి గ్రామపంచాయతీల్లో ఆయన పర్యటించారు. రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని గ్రామపంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కోయవాగు సర్పంచ్ చింతపూరి లక్ష్మి, గ్రామ కార్యదర్శి సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ మాజీ ఫిట్ కార్యదర్శికి సన్మానం

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడ ఓసీపీ ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శిగా పని చేసి ప్రస్తుతం గోలేటి బ్రాంచి కమిటీకి వెళ్తున్న జుపాక రాజేశ్‌ను సోమవారం గోలేటిలోని కేఎల్ మహేంద్ర భవన్‌లో యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు. బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి మాట్లాడుతూ ఖైరిగూడ ఫిట్ కార్యదర్శిగా రాజేశ్ యూనియన్‌కు విశేష సేవలు అందించారన్నారు. ఓసీపీలో యూనియన్ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేశారని ఆయన సేవలను గుర్తించి గోలేటి బ్రాంచి కమిటీలో స్థానం కల్పిస్తున్నట్లు తెలిపారు. బ్రాంచి ఉపాధ్యక్షుడు మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శి జగ్గయ్య, చంద్రశేఖర్, ఫిట్ కార్యదర్శి శ్రీనివాస్, సీపీఐ మండల కార్యదర్శి రవీందర్ పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడ దూరం.. 'గుండాల'

- సాగులో ఆదర్శంగా నిలిచిన గ్రామం
- విద్య, రవాణా సౌకర్యాల్లేక తిప్పలు



బురదమయంగా రోంపెల్లి -గుండాల మట్టి రోడ్డు

తిర్యాణి: సాగులో ఆదర్శంగా ఉన్న మండలంలోని గుండాల గ్రామం అభివృద్ధికి మాత్రం ఆమడ దూరంలో నిలిచింది. బాహ్య ప్రపంచానికి దూరంగా, పచ్చని అడవి మధ్యలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనను ప్రభుత్వం విస్మరించడంతో గ్రామస్తులు నానా తంటాలు పడుతున్నారు. గుండాల గ్రామపంచాయతీ పరిధిలో ఏడు గూడాలు ఉండగా 1000కి పైగా జనాభా నివసిస్తున్నారు.

ఇక్కడి పంటలకు డిమాండ్..

గ్రామంలో నేలంతా రాతిమయంగా ఉండటంతో వ్యవసాయానికి ఏ మాత్రం అనువుగా ఉండదు. అటువంటి నేలపై గ్రామంలోని బొజ్జు అనే యువకుడు వినూత్న ఆలోచనలతో సేంద్రియ పద్ధతుల్లో పంటలు సాగు చేస్తున్నాడు. రాతినేలపై చెరువుమట్టి పోసి ఎటువంటి రసాయనిక ఎరువులు వాడకుండా పంటలు సాగు చేస్తూ అధిక దిగుబడులు పొందుతున్నాడు. దీంతో గ్రామంలోని మిగితా రైతులు కూడా ఈ పద్ధతిని అనుసరించి సాగులో ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇక్కడ పండించే పంటలకు బహిరంగ మార్కెట్‌లో మంచి డిమాండ్ సైతం ఉంది. ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్న గ్రామంలో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

రోడ్డు లేక ఇబ్బందులు..

గుండాల నుంచి నిత్యావసర, అంగన్‌వాడీ సరుకులు, పింఛన్, రేషన్ బియ్యం తదితర అవసరాల కోసం ఆరు కిలోమీటర్ల దూరంలోని రోంపెల్లి గ్రామానికి వెళ్లాల్సి ఉంటుంది. కాగా గత ఏడాది వరకు గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో కాలినడకన వెళ్లే పరిస్థితి ఉండేది. వీరు పడే కష్టాలు గుర్తించిన పోలీసులు 'పోలీసులు మీ కోసం'లో భాగంగా మట్టిరోడ్డు వేశారు. దాదాపు ఆరు నెలల పాటు రోడ్డుపై రాకపోకలు సాగించారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా బురదమయం కావడంతో పాటు పలు చోట్ల కోతకు గురైంది. దీంతో రోడ్డు కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. కాగా గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న రెండు గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో కేవలం మూడో తరగతి వరకు మాత్రమే తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో మూడో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లలేక చదువు ఆపేసి మేకల కాపలదారులుగా, వ్యవసాయ కూలీలుగా మారుతున్నారు. ఇక్కడి ప్రజల సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులను ఎన్నోమార్లు కలిసి విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

తారురోడ్డు నిర్మాణం చేపట్టాలి

రోంపెల్లి నుంచి గుండాల వరకు రోడ్డు నిర్మాణం మంజూరైందని, అయితే ఫారెస్టు క్లియరెన్స్ రావడం లేదని అధికారులు చెబుతున్నారు. పోలీసులు వేసిన మట్టిరోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయంగా మారడంతో మళ్లీ కాలినడకన వెళ్లాల్సి వస్తుంది. వెంటనే గ్రామానికి తారురోడ్డు నిర్మాణం చేపట్టాలి.

\- శంకర్, గుండాల

మౌలిక సదుపాయాలు కల్పించాలి

గుండాల పంచాయతీ పరిధిలో రెండు గిరిజన ప్రాథమిక పాఠశాలలు ఉండగా వాటిలో కేవలం 3వ తరగతి వరకు మాత్రమే తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులు పై చదువులు చదవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా మంది విద్యార్థులు 3వ తరగతి పూర్తయ్యాక మేకల కాపరులుగా మారుతున్నారు.

\- మర్సుకోల అశోక్, గుండాల

కేసీఆర్ చిత్రపటానికి వీఆర్ఏల క్షీరాభిషేకం



దహెగాం: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్ఏలు



చింతలమానెపల్లి: క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్ఏలు

పెంచికల్‌పేట్: వీఆర్ఏలను క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో మండల కేంద్రంలో వీఆర్ఏల సంఘం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ ఏళ్లుగా చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న వీఆర్ఏలను ప్రభుత్వం క్రమబద్ధీకరించడం సంతోషంగా ఉందన్నారు. సంఘం నాయకులు కమలాకర్, పద్మ, నారాయణ, విజయ్, బాబురావు, బాపు తదితరులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: వీఆర్ఏలను క్రమబద్ధీకరిస్తూ జీవో జారీ చేయడంతో మండల వీఆర్ఏలు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మండల వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు హరిదాస్, తహసీల్దార్ మష్కూర్ అలీ, వీఆర్ఏల సంఘం నాయకులు జలందర్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్ (టి)లో..

సిర్పూర్(టి): ప్రభుత్వం వీఆర్ఏలను క్రమబద్ధీకరిస్తూ జీవో విడుదల చేయడంతో మండల కేంద్రంలో వీఆర్ఏల సంఘం ఆధ్వర్యంలో సోమవారం సీఎం కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట క్షీరాభిషేకం చేశారు. సంఘం నాయకులు ఖైరాత్ అలీ, అజ్గర్ అలీ, శ్రావణ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

దహెగాంలో..

దహెగాం: సీఎం కేసీఆర్ వీఆర్ఏల పేస్కేల్ జీవో విడుదల చేసిన సందర్భంగా మండల వీఆర్ఏలు సోమవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేయడంతో పాటు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో వీఆర్ఏలు కుమ్మరి సాయి, విజయ్, వసంత్, మారుతి, కళావతి, మధు, ఖాదర్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: సీఎం కేసీఆర్ వీఆర్ఏ వ్యవస్థను పూర్తిగా రద్దుచేసి వారిని వివిధ శాఖల్లో బదిలీ చేస్తూ జీఓ జారీ చేయడంపై మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మండల వీఆర్ఏలు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షుడు కామేర ప్రకాశ్, ప్రసాద్, జావిద్, లింగయ్య, సుధాకర్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

19వ రోజు కొనసాగిన సమ్మె



మాట్లాడుతున్న కనక ప్రభాకర్

ఆసిఫాబాద్అర్బన్: గ్రామపంచాయతీ కార్మికులు తమ డిమాండ్లు నెరవేర్చాలని ప్రారంభించిన సమ్మె సోమవారం 19వ రోజుకు చేరింది. కార్మికులు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరంలో చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో మట్ల రాజు, శంకర్, నాగేశ్, మహేశ్వర్, సమ్మయ్య, సాబీర్, సుగుణబాయి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకం

కెరమెరి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో పంచాయతీ కార్మికుల పాత్ర ఎంతో కీలకమని బీఎస్పీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కనక ప్రభాకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కొనసాగుతున్న గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెలో పాల్గొని ఆయన మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, అప్పటి వరకు కార్మికులు అనుకున్న విధంగా వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు.

'అధికారుల బెదిరింపులకు భయపడేది లేదు'

రెబ్బెన: అధికారుల బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం 19వ రోజుకు చేరుకుంది. జేఏసీ నాయకులు ఉపేందర్ మాట్లాడుతూ మల్టీపర్పస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి జీవో 60 ప్రకారం కార్మికులకు వేతనాలు అందించాలన్నారు. కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చి సమ్మె విరమణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సుధాకర్, దేవాజీ, ప్రకాశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లోని సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న శ్యామ్ కుమార్

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని వార్డు నంబర్ 1, 2 (సర్ సిల్క్ ఏరియా)లో మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వార్డులో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సోమవారం ప్రాంత మాజీ కౌన్సిలర్, బీజేపీ నేత బాల్క శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో వార్డు ప్రజలు మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, కమిషనర్ అంజయ్యలను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. వార్డు ప్రజలు సంతోష్ ఠాకుర్, జావిద్, మజీద్, బాబురావు, సదానందం పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో..



రెబ్బెన: వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

రెబ్బెన: రాష్ట్ర ఐటీశాఖ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం బీఆర్ఎస్, టీబీజీకేఎస్‌ల ఆధ్వర్యంలో గోలేటిలోని సింగరేణి డిస్పెన్సరీలో ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి పార్టీ, యూనియన్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, ఎంపీపీ సౌందర్య, జెడ్పీటీసీ సంతోష్, సర్పంచ్ అహల్యాదేవి, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, సెంట్రల్ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్అర్బన్: కేటీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్‌కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావ్, నాయకులు వెంకన్న, జీవన్ పాల్గొన్నారు. కేసీఆర్ సేవాదళం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ అనాథాశ్రమంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఆదేశాల మేరకు కేక్‌కట్ చేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేసీఆర్ సేవాదళం జిల్లా అధ్యక్షుడు ఉబెదబిన్ యాహియా, ఆదిల్, అఖీబ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు మేనేజర్‌కు సన్మానం

ఆసిఫాబాద్అర్బన్: ఆసిఫాబాద్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన విశ్వనాథ్‌ను సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్ శాలువాతో సత్కరించారు. ఫీల్డ్ ఆఫీసర్ రాజేందర్, సీఈవో వెంకటరమణ పాల్గొన్నారు.

ఈజ్‌గాం శివాలయంలో భక్తుల సందడి



పూజలు చేస్తున్న బెంగాలీలు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయంలో అధిక శ్రావణ సోమవారం సందర్భంగా సందడి కనిపించింది. బెంగాలీ మహిళలు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి స్వామి వారికి భక్తులు భక్తిశ్రద్ధలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాజేశ్వర్‌రావు, ఈవో వేణుగోపాల్ గుప్తా, ఆలయ అర్చకులు సంతోష్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ ఎరువులు సద్వినియోగం చేసుకోవాలి

రెబ్బెన: ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేస్తున్న ఎరువులను మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఎంపీపీ జుమ్మిడి సౌందర్య అన్నారు. రెబ్బెన పీఏసీఎస్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని రైతులకు యూరియా పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడుతూ మండలంలో సాగవుతున్న పంటలకు కావాల్సిన ఎరువుల కోసం రైతులు ఇబ్బందిపడకుండా అవసరమైన ఎరువులు ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, వైస్ చైర్మన్ మహేష్‌గౌడ్, ఎంపీటీసీ మధునయ్య, సర్పంచ్ పోషమల్లు, అహల్యాదేవి, ఏవో మంజుల, సీఈవో సంతోష్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి



మృతి చెందిన చుక్కల దుప్పి

సిర్పూర్(టి): మండలంలోని హుడ్కిలి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో అడవి కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందినట్లు ఎఫ్ఎస్‌వో మోహన్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అడవి కుక్కలు చుక్కల దుప్పిని వెంబడించగా గ్రామసమీపంలోకి వచ్చింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అక్కిడికి చేరుకున్న అటవీశాఖ సిబ్బంది కుక్కల దాడిలో దుప్పి మృతి చెందినట్లు ధ్రువీకరించి ఖననం చేశారు. వన్యప్రాణుల సంచారం ఉంటే సమాచారం అందించాలని గ్రామస్తులకు సూచించారు.

'మణిపూర్' నిందితులకు ఉరిశిక్ష వేయాలి



మాట్లాడుతున్న ఆదివాసీ, తుడుందెబ్బ నాయకులు

కెరమెరి: మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసీ మహిళలపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితులకు ఉరిశిక్ష వేయాలని ఆదివాసీ మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోవ ఇందిరా, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు కోవ విజయ్ అన్నారు. సోమవారం మండలంలోని ఝరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆదివాసీ హక్కులను రాజ్యాంగం ప్రకారం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సోము, బాదిరావు, చిన్ను తదితరులు ఉన్నారు.

'మతోన్మాదం నుంచి దేశాన్ని కాపాడాలి'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: మతోన్మాదం నుంచి దేశాన్ని కాపాడాలని భారత్ బచావో రాష్ట్ర కమిటీ సభ్యులు వడ్డేపల్లి మనోహర్, జిల్లా నాయకుడు నీరటి రాజన్న అన్నారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో సోమవారం భారత్ బచావో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ దేశంలో దళితులు, బీసీలు, మైనార్టీలపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 31న 11 గంటలకు భవనంలో బీజేపీ, బీఆర్ఎస్ మినహాయించి అన్ని పార్టీలు, అన్ని ప్రజా సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన, కార్మిక సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి భారత్ బచావో వ్యవస్థాపకులు గాజే ఇన్నయ్య హాజరవుతారని తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎం.జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజూ రాకపోకలు బంద్



సిర్పూర్(టి) -కౌటాల ప్రధాన రహదారిపై నిలిచిన వరద నీరు

సిర్పూర్(టి): మండలంలో గత ఆరు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలం మీదుగా వెళ్లే ప్రధాన రహదారులపై రాకపోకలు నిలిచిపోయాయి. పెన్‌గంగ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో సిర్పూర్(టి) –మాకిడి అంతర్రాష్ట్ర రహదారిలో హుడ్కిలి గ్రామం వద్ద లోలెవెల్ వంతెన వరద నీటిలో మునిగిపోయింది. వెంకట్రావ్‌పేట్ –పోడ్సా గ్రామాల మధ్య పెన్‌గంగ నదిపై ఉన్న హైలెవల్ వంతెన పైనుంచి వరద నీరు పొంగి ప్రవహిస్తుండటంతో అధికారులు రాకపోకలు నిలిపివేశారు. సిర్పూర్(టి) నుంచి కౌటాలా, చింతలమానెపల్లి మండలాలకు వెళ్లే ప్రధాన రహదారిలోని పారిగాం గ్రామం వద్ద వంతెన వరద నీటిలో మునిగిపోవడంతో రెండు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షానికి రోజురోజుకు వరద ప్రవాహం పెరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రియాజ్ అలీ, ఎస్సై దీకొండ రమేశ్ ప్రజలకు సూచించారు.

లోడుపల్లిలో కార్డెన్ సెర్చ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ నాగరాజు

పెంచికల్‌పేట్: మండలంలోని లోడుపల్లి గ్రామంలో కాగజ్‌నగర్‌రూరల్ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ప్రతీ ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలు లేని 10 బైక్‌లను సీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సూచించారు. గ్రామంలో నాటు సారా తయారీ చేసినా, విక్రయించినా సమాచారం అందించాలన్నారు. పెంచికల్‌పేట్ ఎస్సై కొమురయ్య, దహెగాం ఎస్సై సనత్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వం వెంటనే ఐఆర్ ప్రకటించాలి



సభ్యత్వ నమోదు చేస్తున్న ఆడే ప్రకాశ్

కెరమెరి: పీఆర్‌సీ కమిటీ వేసి వెంటనే ఐఆర్ ప్రకటించాలని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడే ప్రకాశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. పీఆర్‌సీ ప్రకటన చేయకపోవడంతో ఉద్యోగ ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఆరోగ్యకార్డులను అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో చెల్లుబాటయ్యేలా ఉత్తర్వులివ్వాలని, పెండింగ్ బిల్లులు త్వరలో చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భరత్‌రావు, లెవన్‌కుమార్, అజయ్‌కుమార్, విమల, మౌనిక, సంతోష్ కుమార్, దివ్య, గంగాసాగర్, ప్రవీణ్‌కుమార్, సురేశ్ తదితరులు ఉన్నారు.